

వరుస ప్రమాదాలతో జనం బెంబేలు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని బ్రాహ్మణగూడెంలో వరుస ప్రమాదాలతో జనం బెంబేలెత్తుతున్నారు. బుధవారం నిడదవోలు నుంచి కుంకుడిమిల్లి వెళుతున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఆటోలో న్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మరువక ముందే గురువారం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి లారీ ఢీకొని మరణించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నవంబరు, డిసెంబర్ మధ్య షుగర్ ఫ్యాక్టరీ వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా వరస ప్రమాదాలతో మరణాలు జరిగిన సంఘటన ప్రజలు చర్చించుకుంటున్నారు. మూడేళ్ల క్రితం నిడదవోలు నుంచి పంగిడి వైపు రోడ్లు కొత్తగా వేశారు. రోడ్ల పక్కనే ప్రమాద సూచిక బోర్డులు తొలగించారు. వాటిని తిరిగి వేయకపోవడంతో మలుపుల వద్ద స్కూల్, పెట్రోల్ బంకుల వద్ద నాలుగు రోడ్లు సెంట్రల్ వద్ద ప్రమాద సూచికల బోర్డులు లేవు. దీంతో వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

ప్రైవేట్ స్కూళ్లలో అడ్మిషన్లు షురూ..

- ఇష్టారీతిన ఫీజుల వసూళ్లు
- నోట్ పుస్తకాలు, యూనిఫారం విక్రయాలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న తల్లిదండ్రులు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారుల నియంత్రణ కరువయ్యింది. ఏటా ఫీజులు పెంచుతూ భారీగా వసూలు చేస్తున్నా కనీస చర్యలు తీసుకునే వారు లేరు. విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరు. నామమాత్రంగా తనిఖీ చేస్తూ వదిలేస్తున్నారు. గుర్తింపు లేని పాఠశాలలపైనా చర్యలు చేపట్టడం లేదు. కొన్ని పాఠశాలలకు నోటీసులు ఇస్తూ చేతులు దులుపుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 650 ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్, ఈ ప్రైవేట్ విద్యాసంస్థల్లో లక్షా 25 వేల వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలల్లో కరోనా సమయంలో ఆన్‌లైన్ పేరిట కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులను నిర్వహించి భారీగా ఫీజులు వసూలు చేశాయి. విద్యార్థులకు నామ మాత్రం తరగ తులను నిర్వహించి మొత్తం ఫీజును తీసుకున్నారు.

ఫౌండేషన్ పేరుతో అదనపు వసూలు

ప్రస్తుత విద్యా సంవత్సరం మొదటినుంచే భారీగా ఫీజులను పెంచారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఐఐటి ఇతర ఫౌండేషన్ల పేరిట ఆంగ్లం నిర్వహిస్తున్నామని చెప్పి సంవత్సరానికి రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు సంస్థలను బట్టి ఫీజులను వసూలు చేస్తున్నారు. కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు నెలవారీగా రూ.1500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఫీజులు ఒకసారి 20 నుంచి 40 శాతం వరకు పెరగడంతో విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన చెంద తున్నారు. తరగతి గదుల్లో కనీస సౌకర్యాలు కరువ య్యాయి. వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండటం లేదు. చాలా పాఠశాలల్లో రేకుల భవనంలో తరగతి గదులుగా కొనసాగుతున్నాయి. ఎలాంటి వెలుతురు ఉండడంలేదు. పిల్లలకు ఆడుకోవడానికి కూడా గ్రౌండ్ లేదు. అనుమతుల సమయంలో విద్యాశాఖ చేతివాటం వల్ల విద్యార్థులకు క్రీడాసౌకర్యాలు ఎండమావిగా మారుతున్నాయి. పాఠశాల యాజమాన్యాలు వారికి అనుకూలమైన వారిని పెట్టుకుని పేరెంట్స్ కమిటీల సమావేశాలను కాగితాలకే పరిమితం చేస్తున్నారు.

యథేచ్ఛగా యూనిఫారాలు, పుస్తకాల విక్రయాలు

నోట్సు పుస్తకాలు, బ్యాగులు, స్కూల్ డ్రెస్ ల పేరుమీద భారీగా వసూలు చేస్తున్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు కొన్ని తరగతులకే అనుమతులు తీసుకుని అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ అనుమతులు లేకుండా తరగతులను కొనసాగిస్తున్నారు. 10వ తరగతిలో వేరే పాఠశాలల పేరు మీద అనుమతులు తీసుకోవడం గాని ప్రైవేట్ క్యాండెట్‌గా పరీక్షలు రాయించడం లాంటివి చేస్తున్నారు. ఇదంతా విద్యాశాఖాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఈ వ్యవహారంలో ప్రతి సంవత్సరం భారీగానే చేతులు మారుతున్నాయి. నగరంలో పలు చోట్ల ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వాహకులు గుర్తింపు లేకుండానే పాఠశాలల నిర్వహణ చేస్తున్నారు.

పాఠశాలల్లో ఫీజులు భారీగా పెంచారు..

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు బాగా పెంచారు. కరోనా తర్వాత ఖర్చులు పెరిగాయని 30 శాతం వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ఒకటో తరగతికి రూ.20 వేలు చెల్లించాలని కోరారు. బుక్స్, డ్రెస్‌లకు అధికంగా తీసుకుంటున్నారు. ఇద్దరు పిల్లలకు గత సంవత్సరం కంటే 30 శాతం అధికంగా ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ప్రైవేట్‌లో ఫీజులు ఇలా పెంచితే చదివించే పరిస్థితి లేదు. అధికారుల పర్యవేక్షణ పెరగాలి. ఫీజుల నియంత్రణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి.

- ఎస్.వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం, ఆర్యాపురం.

14న సిఎం వైఎస్.జగన్ పర్యటన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం


పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏప్రిల్ 14న కొవ్వూరు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శుక్రవారం పరిశీలించారు. కొవ్వూరు, చాగల్లు మండలాల్లో మంత్రి, కలెక్టర్, జెసి, మున్సిపల్ కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ, ఏప్రిల్ 14న భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పుట్టిన రోజున కొవ్వూరు నియోజకవర్గం పరిధిలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఆ నేపథ్యంలో కొవ్వూరు, చాగల్లు మండలాల్లో పలు ప్రాంతాలను కలెక్టర్‌తో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, కొవ్వూరులోని యువరాజ్ ఫంక్షన్ హాల్ సమీపంలో దేచర్ల రిలయన్స్ సైట్, తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రాంతాలను, గోష్పాద రేవు సమీపంలో ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, మాజీ ఎంఎల్‌సి కె.శివ రామకృష్ణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

టిడ్కో ఇళ్లు అప్పగించాలని నిరసన

ప్రజాశక్తి-నిడదవోలు

జగనన్న రాజ్యంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉందని సిపిఎం ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్ల ఇళ్ల వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ ప్రజల విశ్వాసం కోల్పోయిన వైసిపి ప్రభుత్వం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ జగనన్న మా నమ్మకం. మా భవిష్యత్ అంటూ నినాదంతో ముందుకొస్తోందన్నారు. సంవత్సరాల తరబడి వేలాదిమంది ప్రజలు సొంత డబ్బులు ప్రభుత్వానికి చెల్లించినా శిథిలావస్థకు చేరుకున్న టిడ్కో ఇళ్ల లబ్దిదారులకు అందించకుండా రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. స్థానిక ఎంఎల్‌ఎ ఇన్ని సంవత్సరాల్లో ఒక్కసారి కూడా టిడ్కో ఇళ్ల సముదాయాన్ని సందర్శించకపోవడం బాధ్యత రాహిత్యం అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో డి.రమేష్, వి.ప్రభాకరరావు, షేక్ యూసఫ్‌షాహీ, ఎస్.సత్యనారాయణ, ఫాతిమా పాల్గొన్నారు.

22న పడాల శతజయంతోత్సవాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అభ్యుదయ రచయితల సంఘం, జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22న పడాల రామారావు శతజయంతోత్సవాలు జరుపుతున్నట్లు అరసం జిల్లా అధ్యక్షుడు పడాల వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ ఆశపు రామలింగేశ్వరరావు, ఎంపీ మార్గాని భరత్ రామ్, పూర్వ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎం.వెంకటేశ్వర్లు, కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, ఆంధ్రప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డికె.నాగరాజు తదితరులు పాల్గొంటున్నారని పడాల వీరభద్రరావు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచార ఆందోళన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నేత వనజ


కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలను సంసిద్ధులను చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయములో జిల్లా సమితి సమావేశం పార్టీ జిల్లా సహాయకార్యదర్శి రేఖ భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వనజ మాట్లాడారు. ఆకాశాన్నంటుతున్న ధరలభారంతో సామాన్యుడి బతుకు భారంగా మారిందని, వంట గ్యాస్, ఇంధన ధరలతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు పేదల బ్రతుకులను చిన్నాభిన్నం చేస్తున్నాయన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాట ధర నోచుకోవడం లేదని, కార్మికుల హక్కులు కాలరాస్తున్నారన్నారు. పేదలకోసం సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని అమలు చేయకపోగా ప్రభుత్వరంగ సంస్థలను విధ్వంసం చేస్తూ నిరుద్యోగ సమస్యను పెంచి పోసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ బిజెపి కో హటావ్.. దేశ్ కో బచావ్ నినాదంతో జిల్లాలో చేపట్టనున్న సిపిఐ, సిపిఎం ప్రచార ఆందోళనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.కొండలరావు, కె.జ్యోతిరాజు, ఆచంట సత్యనారాయణ, లక్ష్మణ్, జిల్లా సమితి సభ్యులు సప్పా రమణ, ఎం.రాజు, నాగేశ్వరావు, పుల్లారావు, శ్రీనివాస్‌రావు, నల్లా రామారావు, కిర్ల కృష్ణ, ఎం.ప్రసాద్ ప్రసంగించారు.

'జగనన్నే మా భవిష్యత్తు' ప్రారంభం


జిల్లావ్యాప్తంగా శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కొవ్వూరు రూరల్ ప్రజలకు మా ప్రభుత్వం చేసింది ఇది అని ధైర్యంగా చెప్పే కార్యక్రమం 'జగనన్నే మా భవిష్యత్' అని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని 19వ వార్డులోని ఇందిరమ్మ కాలనీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రతి ఇంటి నుంచి వివరాలను సేకరించి మంత్రి స్వయంగా వారి అభిప్రాయాలను నమోదు చేశారు. 'జగనన్నే మా భవిష్యత్తు' స్టిక్కర్లను ఇంటింటికీ అతికించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కోడూరి శివరామకృష్ణ, జెసిఎస్ ఇన్‌ఛార్జి నగళ్లపాటి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు రుత్తాల భాస్కరరావు, కౌన్సిలర్లు అంకోలు లిల్లీ పద్మ, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, కో ఆప్షన్ మెంబర్ అలీ, గంధం సాయి, వరిగేటి సుధాకర్, ఆత్కూరి దొరయ్య, బండి పట్టాభి రామారావు, ముదునూరి నాగరాజు పాల్గొన్నారు. **రాజమహేంద్రవరంలో** రాజ్యసభ సభ్యుడు, పిల్లి సుభాస్ చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్ రామ్ నగరంలోని 38, 22 వార్డులలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ పాలన, ప్రస్తుత వైసిపి పాలన మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేయడమే కాక జగన్ పాలనపైనా, సంక్షేమ పథకాలపైనా అవి అమలవుతున్న తీరుపై ప్రజాభిప్రాయాన్ని అయిదు ప్రశ్నల ద్వారా తెలుసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, అరిగెల బాబు, దుర్వాసుల సత్యనారాయణ, కొత్తా బాల మురళీ, కొత్తా విజయ రాజ్యలక్ష్మి, గృహసారథులు, వార్డు కన్వీనర్లు పాల్గొన్నారు. **కడియం** సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు గెలుపే లక్ష్యంగా పని చేయాలని జెసిఎస్ మండల అధ్యక్షుడు తాడాల చక్రవర్తి కోరారు. మండలంలోని దుళ్ల చౌడేశ్వరీ వీవర్స్ కల్యాణ మండపంలో మురమండ, దుళ్ల గ్రామాలకు సంబంధించి మా నమ్మకం నువ్వేజగనన్న కార్యక్రమంలో చక్రవర్తి మాట్లాడారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తూ ముఖ్యమంత్రి జగన్ పని చేస్తున్నారని , ఆయనకు చేదోడుగా పార్టీ ప్రగతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మురమండ సర్పంచ్ అయినవిల్లి రుక్మిణి వెంకటేశ్వరులు, గారపాటి బుజ్జిబాబు పాల్గొన్నారు. **ధవళేశ్వరం** సచివాలయం-2లో సుబ్బయ్యమ్మపేట, వడ్డెరపేటలో కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్లు, పార్టీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం-2 కన్వీనర్లు తలారి ప్రసాద్, పేర్ల దుర్గాప్రసాద్, పసుపులేటి దేవి, నాయకులు హితకారిణి సంఘం డైరెక్టర్ దేవులపల్లి సరిత రాణి, ఎన్‌వి.శేఖర్ పాల్గొన్నారు.


కొవ్వూరులో పాల్గొన్న మంత్రి వనిత


రాజమహేంద్రవరంలో ఎంపీలు భరత్, బోస్



ధవళేశ్వరంలో..

రంపచోడవరం జిల్లా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

అరకు పార్లమెంటు నియోజకవర్గం భూవిస్తరణలో ఎక్కువగా ఉన్నందున రంపచోడవరం డివిజన్ కేంద్రంగా మరో నూతన జిల్లాను ఏర్పాటు చేయాలని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కోరింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పలు ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని ఇప్పుడు మరో నూతన జిల్లా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసిందని, అది శుభ పరిణామమన్నారు. నూతన జిల్లా ఏర్పాటు చేసినట్లయితే పోలవరంలోని గ్రామాలను, రాష్ట్ర విభజనలో కలిసొచ్చిన మండలాలను కలుపుకొని రంపచోడవరం కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు.

కార్టూ'నిజం'



జగన్‌ను గద్దె దించేందుకు సిద్ధం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నిరంకుశ పాలన సాగిస్తున్న జగన్ మోహన్ రెడ్డిని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక 6, 31 డివిజన్లలో మజ్జి రాంబాబు, మాలే విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ అప్రజాస్వామిక పరిపాలనను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్న జగన్‌ను గద్దె దించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. సామాన్యుడి జీవనాన్ని జగన్ అతలాకుతల చేస్తున్నాడన్నారు. నిత్యావసర సరుకులు మొదలు అన్నింటి ధరలూ ఆకాశాన్నంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, బుడ్డిగ గోపాలకష్ణ, మీసాల నాగమణి, కొయ్యల రమణ, దాస్యం ప్రసాద్, మహబూబ్ ఖాన్, ఈతలపాటి రవి, కడలి రామకృష్ణ, సింహా నాగమణి, నాయుడు మాస్టర్, వీరా రాము, కిలపర్తి నాగభూషణం మజ్జి మణికంఠ, శనపతి సత్తిబాబు, పాడి లలిత, కుమారి, స్వర్ణ, దాసు సత్యవతి, సుధీర్, మల్లేష్, పేరిశెట్టి సత్తిబాబు, దేవీ, జయ, నాయకులు జక్కంపూడి అర్జున్, ఉప్పులూరి జానకి రామయ్య, సంసాని ప్రసాద్, పుల్లూరి శ్రీను, గునవర్తి శివ, నల్లం ఆనంద్, పొలాకి పరమేష్, కేబుల్ మురళి, సందక లక్ష్మణరావు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్టాలిన్

జేగురుపాడులో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని జేగురుపాడు ఆడదాని రేవు వంతెన వద్ద శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన దెందులూరి వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి కుమారులు సూరిబాబు, మహేష్ బాబు ఏర్పాటు చేసిన చలివేంద్రంను గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ప్రారంభించారు. ప్రజలకు శీతలపానీయం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిచ్చెనకోళ్ల గోవిందు, బోడా అచ్యుత్, విశ్వనాధ్, మేకా శ్రీను పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని సుబ్బరాయపురంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటనలో బాధితులకు జనసేన పార్టీ నాయకులు శుక్రవారం సాయం అందజేశారు. నిత్యావసర సరుకులు, 75 కేజీల బియ్యం, కూరగాయలు, కిరాణా సామాన్లు, రూ.7,500 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు సువర్ణ రాజు, దేవరపల్లి మండల అధ్యక్షులు కాట్నం గణేష్, దేవరపల్లి గ్రామ అధ్యక్షులు కంబాల సత్తి బాబు, కృష్ణంపాలెం పంచాయితీ ప్రెసిడెంట్ నాయుడు దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.


భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

ఏసు క్రీస్తు ప్రాణ త్యాగం చేసిన రోజు గుడ్ ఫ్రైడేను జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవార భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరంలో ఎంపీ మార్గాని భరత్ రామ్ నగరంలోని బైబిల్ మిషన్ కెథ్డ్రాల్, సెంట్ పీటర్స్ లూథరన్ చర్చిలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసు క్రీస్తు నుంచి కరుణ, క్షమా గుణం, తోటివారికి సాయపడడం నేర్చుకోవాలన్నారు. క్రీస్తు మానవ జన్మ సార్థకత ఏమిటో, మానవులు ఎలా జీవించాలో ఆచరించి చూపారన్నారు. ఈ కార్యక్రమాల్లో వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, బిషప్ ఎన్.విజయరాజు, డాక్టర్ ఎన్.సీమెన్ సుదర్శన్, ఎన్.విలియమ్ బెంటిక్, ఎ.శామ్యూల్ రాజు, కె.సుచందన్ పాల్, నెల్సన్ ఫ్రాన్సిస్ వెస్లీ, నక్కా నగేష్, గుర్రం గౌతమ్, పల్లా సాయి, మాజీ సర్పంచ్ కంటే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** మండలంలో పలు గ్రామాల్లో ఏసుక్రీస్తు గీతాలాపన చేశారు. నిర్మలగిరి గౌరీపట్నం మేరీ మాత ఆలయం వద్దకు కాలినడకన వెళ్లి దర్శనాలు చేసుకున్నారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఆర్‌సిఎం సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సిలువ మార్గంలో రెవరెండ్ ఫాదర్ దానియేలు పాస్టర్ జాన్, వందలాదిగా జనం పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంలోని దేవాలయాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప్పరగూడెం సెయింట్ పాల్ లూథరన్ దేవాలయంలో గెల్లా రాజన్ బాబు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. గోపాలపురం ప్రధాన సెంటర్లో క్రీస్తు సిలువ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. క్రీస్తు సిలువను వెంకటేశ్వరరావు మోసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేసు అత్యంత కరుణామయుడని ఆయన ప్రేమ అనంతమైనదని ఆయన కొనియాడారు.


గోపాలపురంలో సిలువను మోస్తున్న మాజీ ఎంఎల్ఎ వెంకటేశ్వరరావు



రాజమహేంద్రవరంలో వేడుకల్లో పాల్గొన్న ఎంపీ భరత్

నేరాలు ఘోరాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి

మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - అలమూరు

216ఎ నంబరు జాతీయ రహదారిపై మూలస్థాన అగ్రహారం వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. అలమూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న షిఫ్ట్ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. అదే వేగంతో వెళ్లి పక్కనే ఉన్న ఇటుక ట్రాక్టర్‌ను ఢీకొని రోడ్డుపై పల్టీ కొట్టి సమీపంలో ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కడియం మండలంలోని వేమగిరి తోటకు చెందిన కారు డ్రైవర్ కాండ్రేగుల జానకి రామయ్య (23) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురుతో పాటుగా ద్విచక్ర వాహన దారునికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్ పై రాజమహేంద్రవరం తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనధికారంగా ఇటుక లోడుతో హైవే పక్కనే పార్కింగ్ చేసిన ఇటుక ట్రాక్టర్ డ్రైవర్ పై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-చాగల్లు

లారీ ఢీ కొన్న సంఘటనలో ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన మండలంలో బ్రాహ్మణగూడెం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణగూడెం గ్రామానికి ఉబ గమనియల్(77) టీ తాగుతున్నందుకు కాఫీ హోటల్‌కు వెళుతున్నాడు. ఈ సమయంలో నిడదవోలు నుంచి పంగిడి వెళ్లే లారీ అతనిని ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతనిని 108 వాహనంలో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తుండగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుమారుడు వీర్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సిహెచ్‌వి.రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కిషోర్ మృతదేహం

గుళికలు తిన్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

డ్వాక్రా డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో గుళికలు తిని భర్త మృతి చెందాడు. ఈ సంఘటన వాదాలకుంట గ్రామంలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వాదాలకుంటకు చెందిన ఎలిపిన కిషోర్ వ్యవసాయ కూలి. తన భార్య శిరీషకు డ్వాక్రా లోను రావడంతో, డబ్బులు ఇవ్వాలని కిషోర్ అడిగాడు. డబ్బులు ఇచ్చేందుకు ఆమె నిరాకరించడంతో కిషోర్ శుక్రవారం ఉదయం గుళికలు తిన్నాడు. స్థానికులు అతనిని చికిత్స నిమిత్తం గోపాలపురం తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు తరలిస్తునట్లు తెలిపారు.

మృతుని ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎర్రవరం జాతీయ రహదారిపై పేరవరం సెంటర్ వద్ద గురువారం లభించిన గుర్తు తెలియని మృతదేహం వివరాలు తెలిసినట్టు ఏలేశ్వరం ఎస్‌హెచ్ ఒ మాణిక్యం తెలిపారు. మృతుడు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన లొండ సుబ్బారావు (45) గా గుర్తించా మన్నారు. ప్రమాద వివరాలు తెలియవలసి ఉందన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారన్నారు. మృతదేహాన్ని పంచనామా నిర్వహించి ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించామన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్ఇబి అధికారులు

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం పట్టణం లో 100 మద్యం సీసాలను శుక్రవారం ఎస్ఇబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం ఎస్ఇబి సిఐ వీరబాబు ఆధ్వర్యంలో అమలాపురం మార్కెట్ లో బుంగా శ్రీను ఇంటిపై దాడి చేశారు. ఈ దాడుల్లో యానాం మద్యాన్ని ఎస్ఇబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

నిలువెత్తు నిర్లక్ష్యం..

- రూ.17 కోట్లతో అభివృద్ధి పనుల్లో డొల్లతనం
- చూసి చూడనట్లు వదిలేస్తున్న అధికారులు
- గుత్తేదారుడు రూ.3 లక్షలు ఎవరికి ఇచ్చినట్లు



నాసిరకంగా నిర్మిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడలో జెఎన్టియు పరిధి సుమారు 100 ఎకరాల్లో ఉంది. దీనికి అను గుణంగా గతంలో రోడ్ల నిర్మాణాలు చేపట్టిన ఎక్కడా గాని డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టలేదు. వర్షం పడితే భూముల ఇంకిపోవడం తప్ప బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో జెఎన్టియూలో ఎన్నో ఎళ్లుగా డ్రైనేజీ సమస్య ఉన్నాగాని పట్టించుకునే నాధుడే కరవయ్యారు. ఇదిలా ఉండగా కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ(జెఎన్టియుకెలో) రూ.17 కోట్లతో రోడ్డు మరమ్మతులు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

జెఎన్టియు నుంచి దీనికి అనుబంధం సంస్థ కళాశాలల నుంచి ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసించి సర్టిఫికెట్ల కోసం వర్శిటీకి రావాలి. గతంలో జెఎన్టియుకు వచ్చిన ప్రతి విద్యార్థికి రోడ్లపై నిలిచే వర్షపు నీరుతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. సర్టిఫికెట్లు తీసుకుని ప్రధాన కార్యాలయం వద్ద తీవ్ర స్థాయిలో మురుగునీరు పేరుకుపోవడంతో పాటు, దుర్వాసన, దోమల తాకిడి అధికంగా ఉండడంతో ఇక్కడ చదువుకుని విద్యార్థులతో పాటుగా ఇతర జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు పడేవారు. వీటిని అన్నింటిని దృష్టిలో పెట్టుకొని జెఎన్టియు రూ.17 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించుకుంది అందుకు అనుగుణంగానే టెండర్లు పిలవగా హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ కంపెనీ టెండర్లను దక్కించుకుని పనులు ప్రారంభించింది.

- అభివృద్ధి పనుల్లో లోపించిన నాణ్యత

విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని చేపడుతున్న వర్షం



మట్టి గ్రావెల్ వేయడంతో తడిపినా పైకి వస్తున్న మట్టి



తిరస్కరించి వెనక్కి పంపిన గ్రావెల్‌తో పనులు

నీరు, మురుగు నీరు బయటకు పోవడానికి మార్గం లేని రోడ్లను ఎత్తు చేయడంతో పాటు డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టి నీరు అంతటిని బయటకు నీరును తొడి వేసేందుకు ఈ నిర్మాణ పనులు చేపడుతున్నారు. రోడ్లు ఎత్తి చేసేందుకు వాడే దారిలో పూర్తిగా మట్టి పేరుకుపోయి ఉందని, అయినా దీనిపైనే రహదారులు ఎత్తు చేసందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారనిపలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో పూర్తిస్థాయిలో నాణ్యత లోపిస్తోందని ,జెఎన్‌టియుకి సంబంధించిన డిఇలు, ఎఇలు, జెఇఇలు ఉన్నా, ఆర్ అండ్ బి అధికారులతో పాటుగా పలువురు అధికారులను సమన్వయం చేసుకుంటూ ఈ పనులు చేస్తున్నా నిర్లక్ష్యం నిలువెత్తున కనిపిస్తోందదని పలువురు ఆరోపిస్తున్నారు.

అంతా నా ఇష్టం..

జెఎన్‌టియులో జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు డ్రైనేజీ పనులు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు అధికారులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారులు అసలు ఉన్నట్ల? లేకపోతే ఈ పనులు ఎవరు చేస్తున్నట్లు? పేరుకే సంస్థ పేరు చెబుతున్నారా..నిర్మాణ పనులు ఇక్కడి వారే చేస్తున్నారా.. రూ.3 లక్షలు ఇచింది ఎవరికీ ఎందుకు ? ఇస్తే మమ్మల్ని అడిగే వారు ఎవరు ఉండరు? రాసేవారు ఎవరు ఉండరు అన్న ఆరోపణలు వస్తున్నా గానీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్టు విమర్శలువస్తున్నాయి.

యానాం వార్తలు

కొత్త వేరియంట్‌తో అప్రమత్తంగా ఉండాలి

- ఎంఎల్ఎ అశోక్

ప్రజాశక్తి - యానాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

యానాంలో కరోనా మహమ్మారి మరోసారి విలయ తాండవం చేస్తున్న నేపథ్యంలో కొత్త వేరియంట్లతో ప్రాణాంతకరంగా మారాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలకు శుక్రవారం హెచ్చరికలు జారీ చేసిందన్నారు.ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, సామాజిక దూరం పాటిస్తూ,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేసుకోవాలని సూచించారు.



యానాంలో శిలువ యాత్ర

శాంతికి ప్రతీకగా సిలువ యాత్ర

యానాంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పలు చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. యానాం పురవీధులలో శిలువ యాత్ర నిర్వహించారు. స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చ్ లో ప్రార్థనలు నిర్వహించారు.



సలాలుద్దీన్ కు చికిత్స అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందితో ఏఎస్ఐ రమణమూర్తి

శభాష్... యానాం పోలీస్

- వ్యక్తిని కాపాడిన ఎఎస్ఐ కవల రమణమూర్తి

గురువారం అర్ధరాత్రి యానాం గౌతమీ గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని ఏఎస్ఐ కవల రమణమూర్తి కాపాడారు. కాకినాడకు చెందిన సలాలుద్దీన్ యానాం బాలయోగి వారధిపై నుంచి గౌతమి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వేటకు బయలుదేరిన మత్స్యకారుడు సలాలుద్దీన్‌ను చూసి ఒడ్డుకు చేర్చాడు. ఈ ఘటన చూసిన ఓ వ్యక్తి యానాం పోలీసులకు సమాచారం అందించగా నైట్ బీట్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ కవల రమణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తికి ప్రథమ చికిత్సగా సిపిఆర్ నిర్వహించి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. కవల రమణమూర్తి సిపిఆర్ చేయడం వల్లనే సలాలుద్దీన్ ప్రాణాలతో బయటపడ్డాడని పోలీస్ సిబ్బందిపై పలువురు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

ఇంటింటికీ పర్యటిస్తా

ప్రజాశక్తి - జగ్గంపేట

నియోజకవర్గ పరిధిలోని ఏడాది పాటు ప్రతి ఇంటికి తిరిగి ప్రస్తుత ప్రభుత్వ పనితీరు, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగ్గంపేట మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. శుక్రవారం జగ్గంపేట టిడిపి కార్యాలయంలో మండలం సంబంధించిన క్లస్టర్ ఇన్చార్జిలకు, బూత్ కమిటీ ఇన్చార్జిలకు యూనిట్ కమిటీ ఇన్చార్జిలకు గ్రామ పార్టీ అధ్యక్షులకు గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శిలకు శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ నుంచి తన స్వగ్రామమైన ఇర్రిపాకలో ప్రారంభించి రెండు రోజులపాటు పర్యటించి రోజుకు 150 గృహాలకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటానన్నారు ప్రజాక్షేత్రంలో వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అన్నారు. శిక్షణా తరగతులకు రాష్ట్ర కార్యాలయం నుండి పరిశీలకులుగా విచ్చేసిన శివ శంకర్, నియోజవర్గ పరిశీలకులు రామిశెట్టి సత్యనారాయణ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికలకు సంవత్సరం కాలం ఉందని క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీలు, యూనిట్ కమిటీలు కలిసి ప్రతి 50 కుటుంబాలకు ఒక కుటుంబ సాధికారక సారధి, మహిళా సారథిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతిరోజు కొంత సమయం కేటాయించి



జగ్గంపేట మండలం శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

ప్రతి ఇంటికి వెళ్లే ఈ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయవలసిన అవసరాన్ని తెలియ చేయాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్చార్జిలు జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు బస్వా సూర్య ప్రకాష్ రావు కొత్త కొండబాబు, క్లస్టర్ ఇంచార్జిలు, బూత్ కమిటీ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, గ్రామ కమిటీ ప్రధాన కార్యదకర్శులు పాల్గొన్నారు.

నూకాంబికకు రూపాయి నాణేలతో అలంకరణ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో గ్రామ దేవతగా విరాజిల్లుతున్న శ్రీ నూకంబిక అమ్మవారిని రూపాయి నాణేలతో శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. కొత్త అమావాస్య పూజల్లో భాగంగా స్థానిక స్టేషన్ సెంటర్లోని నూకాలమ్మ ఆలయంలో నూకాంబిక అమ్మవారికి పూజలు నిర్వహించారు. చైత్ర పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రూపాయి నాణెములతో ప్రత్యేక రీతిలో అలంకరించారు. అనంతరం భక్తుల దర్శనార్థం అనుమతించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ నాయకులు వల్లూరి బల్లియ్య, యార్లగడ్డ శ్రీనివాసు, పెనుమర్తి పూర్ణ వీర వెంకట సత్యనారాయణ, నేతి బంగారం, బోళ్ల శేఖర్, పేకేటి చిరంజీవి, మద్దుకూరి జోగారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో ఆరు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగిన శ్రీ శంగార వల్లభ స్వామి కళ్యాణ ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి.ఈ ముగింపు ఉత్సవంలో సుమారు 5 వేల మంది పాల్గొన్నారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

యథేచ్ఛగా మట్టి దోపిడీ

ప్రజాశక్తి - కొత్తపేట

నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసన్నలో గోదావరి పరివాహకం ప్రాంతాల్లో యథేచ్ఛగా మట్టి దోపిడీకి గురవుతోందిని టిడిపి నాయకులు ఆరోపించారు. శుక్రవారం కొత్తపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్తిబాబు, మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు ధర్నాల రామకష్ణ, మండల టిడిపి అధ్యక్షులు కంఠంశెట్టి శ్రీను, కొత్తపేట టిడిపి అధ్యక్షులు గుబ్బల మూర్తి మాట్లాడుతూ .అధికార పార్టీ నేతలకు మట్టి ఆదాయ వనరుగా మారిందన్నారు. అడ్డు అదుపు లేకుండా కొల్లగొడుతున్న మట్టిని ఇతర ప్రాంతాలకు ప్రత్యేకించి ఇటుక బట్టీలకు తరలిస్తూ అక్రమార్కులు రూ.కోట్లకు పడగలెత్తుతున్నారని అన్నారు. నాలుగేళ్లుగా నిరంతరం ఈ ప్రక్రియ కొనసాగుతున్నా, అధికారులు కన్నెత్తి చూడలేకపోతున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తున్న వారిని వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కొత్తపేటలో శుక్రవారం టిడిపి నాయకులు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మట్టి అక్రమాలను అరికట్టకపోతే భావితరాలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వరద సమయాల్లో లంక గ్రామాలకు పెనుముప్పు పొంచి ఉందన్నారురు.. వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉందన్నారురు. అధికార యంత్రాంగం మట్టి దోపిడీని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు.



న్యాయవాదులను సత్కరిస్తున్న తోటి పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1980-85 పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది వృత్తి చేపట్టి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న న్యాయవాదులు పల్లెటి రాజకుమార్, సూరంపూడి శ్రీనివాసులను తోటి పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ పేదలకు న్యాయం అందించడం, న్యాయపరమైన సమస్యలు రాకుండా చూడడం తప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మేక నాగరాజు, ఎం.రామకష్ణ, ఆర్. వెంకటరమణ, జానకిరామ్, సూర్యకష్ణ, లావణ్య, జానకిరత్నం, శ్రీవాణి సుజాత, గ్రామ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఘనంగా అన్నదానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

శ్రీరామనవమి వేడుకల ముగింపు సందర్భంగా మండలంలోని దమ్మెన్నులో రామాలయం వద్ద శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించినట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. గ్రామస్తులు, పరిసర గ్రామాల భక్తులు సుమారు 1500 మంది అన్నదానంలో పాల్గొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి వెంకటేశ్వర్లు, కానుబోయిన పెదపుల్లయ్య, పెచ్చెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ సతీష్


అభివృద్ధి, సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

అభివృద్ధి, సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో ఎయిమ్స్ కళాశాల ప్రాంగణంలో నగర పంచాయతీ ఛైర్మన్ కె. ప్రవీణ్ అధ్యక్షతన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎంఎల్ఎ చెక్కు పంపిణీ చేశారు. అనంతరం ఎంఎల్ఎ సతీష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని సుమారు రూ.రెండు లక్షల కోట్లు వివిధ పథకాల రూపంలో పేదలకు నేరుగా చేరాయని తెలిపారు. ఈ సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరల జగనన్న ప్రభుత్వమే రావాలని అన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం వచ్చేలా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోలా గంగ భవాని, కౌన్సిలర్లు, సర్పంచులు, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం-పర్యావరణంపై కరువైన పర్యవేక్షణ

ప్రజాశక్తి - మామిడికుదురు



చెత్తకుప్పలో పడి ఉన్న మొక్కలు

పచ్చదనం - పర్యావరణ పరిరక్షణ కొరకు రూ.లక్షలు వెచ్చిస్తున్నా క్షేత్ర స్థాయిలోనే పర్యవేక్షణ కరువైంది. మామిడికుదురు మండలం పరిధిలో ఉపాధి హామీ చట్టం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వివిధ రకాల మొక్కలు అటవీశాఖ పంపిస్తున్నా అధికారులు నిర్లక్ష్యంతో క్షేత్రస్థాయిలో చెత్త కుప్పల పాలవుతున్నాయి. గత ఏడాది జూన్ లో వచ్చిన మొక్కలు ఎన్ని, నాటినవి ఎన్ని, బతికిన మొక్కలు ఎన్ని అని పరిశీలిస్తే వారి వద్ద సరైన సమాచారం దొరకలేదు. గత ఏడాది వరదల సమయంలో లంక గ్రామాల్లో వేలాది మొక్కలు నాటారు. అన్ని మొక్కలు కొట్టుకుపోయాయి. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో కొన్ని మొక్కలు నాటారు. వాటి పర్యవేక్షణ గాలికి వదిలేయడంతో అలా మాడిపోతున్నాయి. మరికొన్ని మొక్కలు ఉపాధి హామీ కార్యాలయం ఎదుట చెత్తకుప్పలో పడవేశారు. ఇదేనా పచ్చదనం పర్యావరణ పరిరక్షణ అని ప్రజల విమర్శిస్తున్నారు.

అప్పారావు మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - కాకినాడ

సిపిఎం కార్యకర్త కళింగపట్నం అప్పారావు మృతికి సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. శుక్రవారం ప్రతాప్‌నగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అప్పారావు పార్థివ దేహానికి సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ సిపిఎం జిల్లా నాయకులు జి.బేబీరాణి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అప్పారావు సిపిఎం కార్యకలపాల్లో చురుగ్గా పాల్గొనే వారని, ప్రతిరోజు పార్టీ కార్యాలయానికి వచ్చేవారని అన్నారు. అప్పారావు నిబద్ధత గలిగిన కార్యకర్త అని అన్నారు. సిపిఎం నాయకులు సిహెచ్. అజయ్ కుమార్, కె.వీరబాబు, టి.రాజా, పి.వీరబాబు, ఎం.జి.సూరిబాబు, సిహెచ్. విజయ్ కుమార్, రవి, చైతన్య రెడ్డి, ఎన్ .సూర్య నారాయణ, దినేష్ తదితరులు అప్పారావు పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘంటించారు.

పిహెచ్‌సి ప్రారంభానికి ఎదురుచూపులు

ప్రజాశక్తి-మండపేట

ద్వారపూడిలో నిర్మించిన పిహెచ్‌సి ఎప్పుడు ప్రారంభిస్తారని అటు వైద్య సిబ్బంది ఇటు రోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సుమారు 3నెలలు క్రితమే భవనం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం పాత భవనంలో రోగులకు సేవలు అందిస్తున్నారు. అన్ని నూతన భవనంలో వైద్యసేవలు ప్రారంభిస్తే 11గ్రామాల ప్రజలకు ఉపయుక్తమని పలువురు అంటున్నారు.



ద్వారపూడి నూతన పిహెచ్‌సి భవనం

In The Court Of The 12th Additional Distirct Judge :: Pithapuram
I.A.No. 51/2023
in A.S.S.R.No. 284/2019

Between:

Bonepalli Srinivas, S/o. Suryarao, Aged 45 Years, Agrl. Coolie, D.No. 11-6-3/2, Ujjinavari Sterrt, Nidadavolu, W.G.Dist.
...Petitioner /Appellant
AND
Padala Nookaraju (Died) and Others
...Respondents /Respondents

TO: R-6: Padala Ramayamma, W/o. Nookaraju, aged 60 Years, House wife, O.C.Colony, Opp. ZP High School, Chebrolu (V), Gollaprolu (M). (6th Respondent Proposed party leagal heir of 1st respondent)

పై నెంబరు పిటీషనులో 6వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.21-04-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషను మీకు పరోక్షమున తీర్మానించబడును.

KOKA VENKATA KRISHNA RAO
Advocate, Pratap Nagar,
Kakinada-4. Cell: 90000 54365

నోటీసు

మహారాజశ్రీ కొవ్వూరు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 798/2022, O.S. 174/2017

Between:

1. శ్రీమతి మందపల్లి రోజామణి అనే దున్నా రోజామణి
2. శ్రీమతి దున్నా విజయలక్ష్మి

...పిటీషనర్లు/వాదులు
మరియు

1. శ్రీ ఉందుర్తి భాస్కరరావు (డైడ్)
2. శ్రీమతి ఉందుర్తి బుల్లెమ్మ, వగైరాలు

...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

టు:
4వ రెస్పాండెంటు/4వ ప్రతివాది:
శ్రీమతి ఉందుర్తి మాధవి, భర్త: శ్రీను, డోర్ నెం. 7-63, రచ్చబల్ల వద్ద, రామారావు కాలనీ, సాగిపాడు గ్రామం, గోపాలపురం మండలం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో, మైనర్లు అయిన 8 & 9 ప్రతివాదులకు 4వ ప్రతివాది అయిన మిమ్ములను మైనర్ల తరుపున గార్డియన్‌గా అపాయింట్ చేయించమని దాఖలు చేసిన సదరు ఐ.ఎ. పిటీషన్‌లో 4వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించుచున్ననూ మీరు బుద్ధిపూర్వకముగా తీసుకొనకుండా నిలువరించుచున్నందున, శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా నోటీసు అమలు చేయమని ఆర్డరు వేసినందున, యీ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది. కావున **ది. 11-04-2023వ తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయివున్నది. ఆరోజున మీరు స్వయంగా గాని, లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి, మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 11-04-2023

కె.యస్.యస్.వి.జి.వి.ఆర్.మూర్తి
అడ్వకేట్, కొవ్వూరు
స్థలం: కొవ్వూరు
తేది:07-04-2023